www.jananinadam.com RNI NO.TELTEL /12314

# జననినాదం

తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం - సామాన్యుడి ఆయుధం Follow :

Simultaneously published from Asifabad & Hyderabad. ఎడిటర్ జాధవ్ రోహిదాస్ | సంపుటి : 1 సంచిక:154 | బుధ వారం 13-11- 2024 | పేజీలు: 5 వెల: రూ.3.00



విలెకర్లు కావలెను

జననినాదం

ప్రతి అక్షరం సామాన్యుడి అయుధవ తెలుగు దినపత్రిక

సమాజం,స్థానిక రాజకీయ అంశాలపట్లకనీసం అవగాహన కలిగి ఉండి చక్కని రాత,ఓర్పు,నేర్పుగల జర్నలిస్టులకు (జననినాదం) తెలుగుదినపత్రిక ఆహ్వానం పలుకుతోంది. ఆసిఫాబాద్ జిల్లాలో పాత్రికేయులుగా ప్రతిభను చాటేందుకు అసక్తిగల వారు సంప్రదించగలరు.

సంప్రదించాల్సిన నెంబర్ 9550100197 9490111460



## నేడు జార్ఖండ్ తొలిదశ పోలింగ్

**పలు రాష్ట్రాల్లో ఉప ఎన్నికలకు నేడే ఓటింగ్**
**వయనాడ్‌లో అదృష్టం పరీక్షించుకుంటున్న ప్రియాంక**

న్యూఢిల్లీ,నవంబర్12 : రెండు రాష్ట్రాలతో పాటు, పలు రాష్ట్రాల్లో ఉప ఎన్నికలకు రంగం సిద్ధం అయ్యింది. నేటినుంచే అంటే బుధవారం నవంబర్ 13న జార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికల తొలదశ పోలింగ్ జరగనుంది. తొలి విడత ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం 6గంటలతో నిలిచిపోయింది. తొలి దశలో రాష్ట్రంలోని 43 స్థానాలకు పోలింగ్ జరగనుంది. 683 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని 1.37 కోట్ల మంది ఓటర్లు నిర్ణయిస్తారు. 950 పోలింగ్ బూత్‌లలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓట్లు వేయనున్నారు. పోలింగ్ సిబ్బందిని హెలిడ్రాపింగ్ ద్వారా 194 పోలింగ్ కేంద్రాలకు తరలించారు. దీనితో పాటు, కర్ణాటకలోని 3 అసెంబ్లీ స్థానాలు, మధ్యప్రదేశ్‌లోని బుధ్ని, విజయ్‌పూర్ అసెంబ్లీ స్థానాలు, అస్సాంలోని 5 అసెంబ్లీ స్థానాలు, రాజస్థాన్‌లోని 7 అసెంబ్లీ స్థానాలు, కేరళలోని చెలక్కర అసెంబ్లీ స్థానం, వాయనాడ్ లోక్‌సభ స్థానాలకు కూడా ఎన్నికల ప్రచారం ముగిసింది.



## కేసులను తప్పుదోవ పట్టించే యత్నం

**ఢిల్లీలో ఫిర్యాదులతో కెటిఆర్ హైడ్రామా**
**కాంగ్రెస్ అధిష్టానంతో భేటీ కానున్న రేవంత్**

న్యూఢిల్లీ,నవంబర్12 : మొగుడిని కొట్టి మొగసాలకు ఎక్కిన చందంగా ఇప్పుడు కెటిఆర్ ఢిల్లీ మెట్లెక్కారు. బిజెపిపై నమ్మకం లేదంటూనే, అదే ప్రభుత్వానికి జఫిర్యాదులు మోసుకెళ్లారు. తమ హయాంలో జరిగిన అవినీతిపై ఓ వైపు విచారణ సాగుతోంది. వాటికి సమాధానం ఇవ్వడం లేదు. కానీ పదకొండు నెలల రేవంత్ రెడ్డి పాలనలో మాత్రం తెలంగాణ ఆగమైందని ఆయన వలపోస్తున్నారు. ఈక్రమంలో ఢిల్లీకి వెళ్ల అమృత్ పథకంలో అక్రమాలు జరిగాయని ఫిర్యాదుచేశారు. గతంలో ప్రధాని స్వయంగా కాళేశ్వరం కెసిఆర్‌కు ఎటిఎంలాగా మారిందని ప్రధాని స్వయంగా ఆరోపించారు. బిజెపి నేతలు కూడా ఆరోపించారు. వీటిని తిప్పికొట్టడం మినహా బిఆర్ఎస్ చేసిందేమీ లేదు. ఇప్పుడు కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా రేసింగ్ తదితరాల్లో అవినీతి గుప్పమంది. మొత్తం గా ఇన్ని రోజులు తెలంగాణకే పరిమిత మైన కుంభకోణాల రాజకీయం ఇప్పుడు ఢిల్లీ చేరింది. తెలంగాణకు చెందిన కీలకమైన ముగ్గురు వ్యక్తులు హస్తినలో మకాం వేసారు.

2వ పేజీలో...



## మట్టి దిబ్బలు కూలి నలుగురి మృతి

2వ

లక్నో, నవంబర్12: ఇంటిగోడలకు పూసేందుకు బంకమ ట్టి కోసం పోయిన మహిళలు తిరిగిరాని లోకాలకు వెళ్లిపో యారు. మట్టిని సేకరిస్తుండగా ఒక్కసారిగా మట్టిదిబ్బ కుప్పకూలి మీద పడటంతో నలుగురు మహిళలు మరణించారు. మరో ఐదుగురు మహిళలకు గాయాలయ్యా యి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కాస్‌గంజ్ జిల్లాలోని మోహన్ పురా గ్రామంలో మంగళవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. మోహన్‌పురా గ్రామానికి చెందిన కొంద రు మహిళలు ఇంటి గోడలకు పూసేందుకు బంకమట్టి కోసం ఆ గ్రామ శివార్లలోని బాయి ఒడ్డున ఉన్న మట్టిదిబ్బ దగ్గరికి వెళ్లారు. అక్కడ మట్టిని సేకరిస్తుండగా ఒక్కసారిగా మట్టిదిబ్బ కుప్పకూలి మహిళల మీదపడింది.



## అమృత్ టెండర్ల అవినీతిపై ఆధారాలున్నాయ్

**అర్హత లేకున్నా కంపెనీలకు కట్టబెడుతున్నారు**
**కేంద్ర ప్రభుత్వ స్కీంలో అవినీతి జరుగుతుందో ప్రధాని ఏం చేస్తున్నట్లు**
**త్వరలోనే పొంగులేటి, రేవంత్ రెడ్డి పదవులు పోతాయ్**
**రూ.8,888 కోట్ల పనులపై కేంద్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలి**
**రేవంత్‌రెడ్డిపై కేంద్ర మంత్రికి ఫిర్యాదు చేశా**
**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

న్యూఢిల్లీ, : తెలంగాణ సీఎం రేవంత్ తనకు ఇష్టం వచ్చిన కంపెనీలకు అర్హత లేకున్నా టెండర్లు కట్టబెడుతన్నారని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, కుంభకోణాల్లో కూరుకుపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్రానికి కేటాయించిన రూ.8,888 కోట్ల పనులపై కేంద్ర ప్రభుత్వం విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అమృత్ టెండర్ల అవినీతిపై అన్ని ఆధారాలున్నాయని చెప్పారు. సీఎంగా ఉండి రేవంత్‌రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రిని కోరామన్నారు. ఢిల్లీలో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. అర్హత లేకపోయినా శోధా కంపెనీకి టెండర్లు కట్టబెట్టారని చెప్పారు. రూ.1,137 కోట్లకు సంబంధించిన పనులు ఆ కంపెనీకి ఇచ్చారన్నారు. 2021-22లో శోధా కన్‌స్ట్రక్షన్ నికర ఆదాయం రూ.2.2 కోట్లు మాత్రమేనని, అలాంటి కంపెనీకి రూ.800 కోట్ల టెండర్లు ఎలా చేస్తుందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన టెండర్లు రద్దు చేయాలని కేంద్రమంత్రిని కోరామన్నారు. అమృత్ పథకం టెండర్లకు సంబంధించి వెబ్‌సైట్‌లో వివరాలు లేవని, కేంద్రం స్కీమ్‌లో అవినీతి జరిగితే ప్రధాని మోదీ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఆర్ఆర్ ట్యాక్ వసూలు చేస్తున్నారని ప్రధాని మోదీ స్వయంగా ఆరోపించారు. మరి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. రేవంత్

2వ పేజీలో...



## బిజెపిని గద్దెదించినపుడే ఉద్యోగావకాశాలు

న్యూఢిల్లీ : మత విద్వేషాలను రెచ్చగొట్టే బిజెపిని గద్దెదించితేనే ఉద్యోగావకాశాలు వస్తాయని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షులు అఖిలేష్ యాదవ్ పేర్కొన్నారు. రివ్యూ ఆఫీసర్ (ఆర్ఒ), అసిస్టెంట్ రివ్యూ ఆఫీసర్ (ఎఆర్ఒ) మరియు ప్రొవిన్షియల్ సివిల్ సర్వీస్ (పిసిఎస్) ప్రిలిమనరీ పరీక్షలను వేర్వేరు తేదీల్లో నిర్వహించాలన్న ఉత్తరప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిపిఎస్‌సి) నిర్ణయంపై అభ్యర్థులు సోమవారం ప్రయాగ్‌రాజ్‌లోని యుపిపిఎస్‌సి ప్రధాన



## అన్నదాతలకు చుక్కలు చూపిస్తున్న పాలకులు

**ధాన్యం పండించినా కొనుగోళ్లు అంతంతమాత్రమే**
**ఏటా చిత్తవుతున్న వరి, పత్తి, సోయా రైతులు**

హైదరాబాద్, : ఆరుగాలం క ష్టపడి కష్టనష్టా లకోర్చి పంట పండిస్తే చివరిలో అమ్ముకునేం దుకు అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రభుత్వం ఏదైనా పంటలు అమ్ముకోవడం దుర్ల భంగా మారుతోంది. కెసిఆర్ అధికారంలో ఉన్న ప్పడు ఊరూరా ధాన్యం కొనుగోలు కేంద్రా లంటూ ఊదరగొట్టారు. మిల్లర్లకు మద్దతుగానే నిలిచారు. ఇప్పడు అదే పరిస్తితి ఉంది. మార్కెట్ కమిటీలు ఉత్సవ విగ్రహాల్లా మారాయి. వరి కావచ్చు, పత్తి, సోయా, కంది ఇలా ఏ పంటయి నా రైతులు చిత్తవ్వాల్సిందే. వానాకాలంలో పంటలు బాగా పండి దిగుబడులు ఆశాజనకం గా ఉండటంతో ఈసారి చేసిన అప్పలైనా తీరు తాయని అనుకుంటున్న రైతులకు ఆశాభంగమే ఎదురవుతోంది. ఓ పక్క పంట చేతికొచ్చే సమ యంలో అకాలవర్షాలు దెబ్బతీస్తుం టే..మరోపక్క మిల్లర్లు సిండికేట్‌గా మారి మద్దతు ధరకు మంగళం పాడుతున్నారు. మద్దతు ధరతో పాటు ఐదువందల రూపాయలు బోనస్ ఇస్తామని ప్రభుత్వం అంటున్నా రైతుకు మద్దతు దక్కడం లేదు. వరికోతలు ప్రారంభమైన తొలినాళ్ళలో సన్నరకం వడ్లు క్వింటా రూ.2500 నుండి రూ.2600 వరకు ధర పలికింది. నల్లగొండ జిల్లా,మిర్యాలగూడ ప్రాంతంలోని మిల్లర్లు అంతా సిండికేట్‌గా మారి మిల్లులకు వచ్చిన ధాన్యం కొనుగోలు చేయకుండా కృత్రిమ..



2వ పేజీలో...

## కాలుష్య కోరల్లో చిక్కుకున్న ఢిల్లీ

**అధ్వాన స్థితికి చేరుకున్న గాలిలో నాణ్యత**

న్యూఢిల్లీ, : దేశ రాజధాని ఢిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకుంది. గత కొన్ని రోజులుగా ఇక్కడ వాయు కాలుష్యం తీవ్రస్థాయిలో ఉంది. గాలి నాణ్యత సూచీ అధ్వాన స్థితిలో నమోదవుతోంది. మంగళవారం ఉదయం కూడా గాలి నాణ్యత అధ్వానంగా నమోదైంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం.. ఉదయం 8 గంటల సమయంలో ఢిల్లీలో గాలి నాణ్యత 355గా నమోదైంది. అశోక్ విహార్ వద్ద 367, ద్వారకా సెక్టార్ 8 వద్ద 390, డీటీయూ వద్ద 366, జహంగిరిపురిలో 417, లోధి రోడ్డులో 313, ముండ్కాలో 404, నజఫ్‌గఢ్‌లో 355, నరేలాలో 356, ఆనంద్ విహార్‌లో 403, ప్రతాప్‌గంజ్‌లో 371, పూసాలో 320, ఆర్‌కే పురంలో 365, రోహిణిలో 415, షాదీపూర్‌లో 359, వివేక్ విహార్‌లో ఏక్యూఐ లెవల్స్ 385గా నమోదయ్యాయి.

# అన్నదాతలకు చుక్కలు చూపిస్తున్న పాలకులు

మొదటిపేజీ తరువాయి...

కోతలు ముమ్మరంగా జరుగుతుండటం.. వందల ట్రాక్టర్లలో ధాన్యం మిల్లులకు వస్తుండటంతో మిల్లర్లు ఒక్కసారిగా ధరను తగ్గించేశారు. కొరత సృష్టిస్తూ మద్దతు ధరను తుంగలో తొక్కుతున్నారు. దీంతో ఆగ్రహించిన అన్నదాతలు రోడ్డెక్కారు. అయినా ప్రభుత్వ అధికారులు, మంత్రులు చర్యలకు దిగలేదు. మంత్రులు మాటలతోనే కాలం వెళ్లబుచ్చు తున్నారు. సన్నరకం వడ్లు మిల్లులకు ఇబ్బడిముబ్బడిగా వస్తుండటాన్ని ఆసరాగా తీసుకున్న మిల్లర్లు ధరను పడేశారు. ఇప్పుడు క్వింటా ధర కేవలం రూ.2100 నుండి రూ.2200 రూ పాయల వరకే పలుకుతోంది. అన్నదాతలు తప్పనిసరి స్థి తుల్లో వచ్చినకాడికి చాలు అన్నట్లుగా అమ్ముకుంటున్నారు. కానీ మిల్లర్లు అంతా ఒక్కటై అసలు కొనుగోళ్ళే నిలిపివేశారు. దీంతో వందల ట్రాక్టర్లు మిల్లుల ముందు బారులు తీరాయి. మిర్యాలగూడ మిల్లుల వద్ద ట్రాక్టర్లను రోడ్లపై పెట్టి ధర్నా చేశారు. నార్కట్‌పల్లి టు అద్దంకి.. మిర్యాలగూడ టు హుజూర్‌నగర్ రహదారిపై గంటపాటు రాస్తారోకో చేయడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. ధాన్యం కోనుగోళ్ళు ప్రారంభించడంతో పాటు మద్దతు ధర పెట్టాలని అన్నదాతలు డిమాండ్ చేశారు. అధికారులు, పోలీసులు అక్కడకు చేరుకోని రైతన్నలకు నచ్చచెప్పి రాస్తారోకో విరమింపజేశారు. అనంతరం మిల్లుల్లో ధా న్యం కొను గోలు ప్రారంభించడంతోధర్నాను విరమించారు. నిజానికి ప్రభు త్వంలో ఎవరు ఉన్నా పక్కాగా ధాన్యం కొనుగోళ్లు సాగడం లేదు. తేమ శాతం 17లోపు ఉండాలనే నిబంధన పెట్టింది. సన్నధాన్యం కోసింది కోసినట్లుగానే పచ్చివడ్లు వస్తుండటంతో కొనుగోలు కేంద్రాల్లో వాటిని కొనుగోలు చేయడంలేదు. దీంతో అన్నదాతలు కొంతరేటు తక్కువైనా మిల్లులకు తరలించి అమ్ముకుంటున్నారు. ఇప్పటివరకు ఏఒక్క సెంటర్‌లో కూడా సన్నధాన్యం గింజ కూడా కొనుగోలు చేయలేదు. కానీ అధికారులు ట్రక్‌షీట్లు మాయచేసి కొనుగోలు చేసినట్లుగా బోనస్ కొట్టేసే ప్రమాదం ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఇకమరోవైపు పత్తి రైతులదీ ఇదే దారి. మద్దతు ధరలు దక్కడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా పత్తి కొనుగోళ్లు బంద్ చేస్తున్నట్టు జిన్నింగ్ మిల్లులు ప్రకటించాయి. సీసీఐ, రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఇకపై పత్తి కొనుగోలు చేయబోమని రాష్ట్ర జిన్నింగ్, స్పిన్నింగ్ మిల్లుల యాజమాన్యాల సంఘం ప్రకటించింది. ఆదివారం సమావేశమైన సంఘం నేతలు పత్తి కొనుగోళ్ల నిలిపివేతకు సంబంధించి కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, సీసీఐ సీఎండీకి లేఖ రాశాయి. పత్తి కొనుగోలులో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) అమలు చేస్తున్న అడ్డదిడ్డ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు లేఖలో పేర్కొన్నాయి. ఈ సీజన్‌లో తెలంగాణలో రైతుల నుంచి పత్తి కొనుగోలుపై సీసీఐ ఎన్నడూ లేని విధంగా కొర్రీలు పెడుతున్నది. రెండు రోజుల క్రితం సీసీఐ తీసుకున్న నిర్ణయం ఇటు మిల్లులకు, అటు రైతులకు శరాఘాతంగా మారింది. మొన్నటి వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 318 జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోలు చేసేది. క్లస్టర్ల వారీగా విభజించి మొదటి మిల్లులో సామర్థ్యం మేరకు కొనుగోళ్లు పూర్తయిన తర్వాతే మరో మిల్లులో కొనుగోలు ప్రారంభిస్తుంది. అప్పటి వరకు మిగిలిన మి ల్లుల్లో ఎలాంటి కొనుగోళ్లు ఉండవు. ఈ విధం గా నల్గొండ జిల్లాలో మొత్తం 23 జిన్నింగ్ మిల్లులు ఉండగా కేవలం 7 మిల్లుల్లోనే కొనుగోళ్లు జరుగుతున్నాయి. దీంతో మిగిలిన మిల్లుల పరిధిలోని రైతులు ఈ ఏడు మిల్లులకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. తద్వారా రైతులపై రవాణా భారం పడుతున్నది. ఈ కొత్త విధానాన్ని ఎత్తేయాలని జిన్నింగ్ మిల్లులు, రైతులు డిమాండ్ చేస్తున్నారు. అయితే పత్తి కొనుగోలు భారం నుంచి తప్పించుకొనేందుకే సీసీఐ ఉన్నతాధికా రులు ఇలాంటి కుట్రలు చేస్తున్నట్టుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతులు నష్టపోయినా పర్వాలేదు.. ప్రభుత్వానికి నష్టం రావొద్దనే విధంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# నేడు జార్ఖండ్ తొలిదశ పోలింగ్

మొదటిపేజీ తరువాయి...

కేరళలోని వాయనాడ్ లోక్‌సభ, చెలక్కర అసెంబ్లీ స్థానాలకు ఇదేరోజు ఉప ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఎన్నికల ప్రచారానికి తెరపడింది. రెండు చోట్లా నవంబర్ 13న పోలింగ్ జరగనుంది. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాయనాడ్ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. ఆమె ముందు ఎల్‌డీఎఫ్ సత్యన్ మొకేరిని అభ్యర్థిగా నిలబెట్టారు. నవ్య హరిదాస్‌ను బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. వాయనాడ్‌లో ఎన్నికల ప్రచారం చివరి రోజున ప్రియాంక గాంధీ సుడిగాలి పర్యటన నిర్వహించారు. 35 సంవత్సరాలుగా ప్రచారం చేస్తున్నానని, అయితే ఇది తన జీవితంలో అత్యంత సంతోషకరమైన ప్రచారమని ప్రియాంక అన్నారు. వయనాడ్‌లో ఎక్కడికి వెళ్లినా, తనకు అపారమైన ప్రేమ లభించిందని, ప్రచారమంతా ప్రజల ప్రేమ తనలో శక్తిని నింపిందన్నారు. కేరళవాసుల గొంతుకగా పార్లమెంటులో ప్రాతినిధ్యం వహించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని ప్రియాంక అన్నారు. కలిసిన ప్రతి వ్యక్తి తనకు స్ఫూర్తినిచ్చారని, వాయనాడ్‌లో భారతదేశ సౌందర్యాన్ని చూశానన్నారు. మా అన్నయ్యను విడిచిపెట్టడం బాధగా ఉన్నప్పటికీ, అంకితభావంతో వాయనాడ్ ప్రజల కోసం పోరాడటానికి ఇక్కడకు వచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు ప్రియాంక.కర్ణాటకలోని షిగ్గావ్, చన్నపట్న, సందూర్ అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. సోమవారం సాయంత్రంతో అయా నియోజకవర్గాల్లో ప్రచారం ముగిసింది. షిగ్గాంలో 8 మంది, చన్నపట్నంలో 31 మంది, సందూర్‌లో 6 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. షిగ్గావ్ నుంచి మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై కుమారుడు భరత్‌ను బీజేపీ పోటీకి దింపింది. కాంగ్రెస్ అభ్యర్థి యాసిర్ అహ్మద్ ఖాన్ పఠాన్ పై భరత్ పోటీ చేస్తున్నారు. సందూర్‌లో బంగారు హనుమంత్‌ను బీజేపీ అభ్యర్థిగా నిలబెట్టింది. ఆయన కాంగ్రెస్‌కు చెందిన అన్నపూర్ణతో తలపడుతున్నారు. అదే సమయంలో ఎన్డీయే మిత్రపక్షం జేడీఎస్ చన్నపట్నం నుంచి నిఖిల్ కుమారస్వామిని బరిలోకి దింపింది. ఆయన కాంగ్రెస్ సీనియర్ నేత సీపీ యోగీశ్వర్‌తో తలపడనున్నారు. ఇకపోతే బుధవారమే నవంబర్ 13న మధ్యప్రదేశ్‌లోని బుద్నీ, విజయ్‌పూర్ అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. దీనికి సంబంధించిన ఎన్నికల ప్రచారాన్ని సోమవారం సాయంత్రం 6 గంటలకు నిలిపివేశారు. విదిశా మాజీ ఎంపీ రమాకాంత్ భార్గవను బుద్నీ నుంచి బీజేపీ పోటీకి దింపింది. ఆయన ముందు కాంగ్రెస్ మాజీ మంత్రి రాజ్‌కుమార్ పటేల్ ఉన్నారు. విజయ్‌పూర్‌లో బీజేపీ అభ్యర్థి రాంనివాస్ రావత్ కాంగ్రెస్ సీనియర్ నేత ముఖేష్ మల్హోత్రాతో తలపడుతున్నారు. నవంబర్ 13న అస్సాంలోని 5 స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. సోమవారం సాయంత్రంతో వీటిలో ప్రచారం నిలిచిపోయింది. ఉప ఎన్నికలు జరగనున్న స్థానాలు ధోలై (రిజర్వ్‌డ్), సిడ్లీ (రిజర్వ్‌డ్), బెహలి, బొంగైగావ్ మరియు సంగురి. ఈ స్థానాలకు మొత్తం 34 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ధుబ్రీ ఎంపీ రకీబుల్ హుస్సేన్ కుమారుడు తంజీల్‌ను సంగురి స్థానానికి కాంగ్రెస్ పోటీ చేసింది. ఆయన కంటే ముందు డిప్లో రంజన్ శర్మకు బీజేపీ టిక్కెట్టు ఇచ్చింది. రాజస్థాన్‌లోని ఏడు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగ నున్నాయి. సోమవారం సాయంత్రంతో అయా నియోజకవర్గాల్లో ప్రచారం నిలిచిపోయింది. ఝుంఝును, దౌసా, ఖిన్వ్‌సర్, డియోలి-ఉనియారా, సాలంబెర్, చౌరాసి మరియు రామ్‌గఢ్ ఎన్నికలు జరగనున్న స్థానాలు. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 126 ప్రకారం, ఎన్నికల ప్రచారం ముగిసిన తర్వాత, నిశ్శబ్ద సమయంలో, అభ్యర్థులు, వారి మద్దతుదారులు ఇంటింటికీ వెళ్లి మాత్రమే, ఓటు వేయమని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. మొత్తంగా ఈ ఎన్నికలు అటు బిజెపికి, ఇటు కాంగ్రెస్ కూటమికి పరీక్ష లాంటివే.

# కేసులను తప్పదోవ పట్టించే యత్నం

మొదటిపేజీ తరువాయి...

ఎవరి పనుల మీద వారు ఢిల్లీ వెళ్లినా రాజకీయ కోణంలో కొంత ఆసక్తి కలుగుతోంది. రాజకీయం ఎప్పుడు ఎలాంటి మలుపు తీసుకుం టుందో చెప్పలేం. ఇప్పటికే రేవంత్ సర్కారుపై కేటీఆర్ ఫిర్యాదు చేశారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి హస్తిన వెళ్లారు. మరోవైపు గవర్నర్ ఢిల్లీ పర్యటన అనేక చర్చలకు దారి తీస్తోంది. అమృత్ పథకంలో భారీ స్కామ్ జరిగిందని ఆరోపిస్తూ వస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్రమంత్రికి ఖట్టర్‌కు ఫిర్యాదు చేశారు. టెండర్లు రద్దు చేసి వెంటనే ఈ విషయంపై విచారణ చేపట్టాలని సూచించారు. రేవంత్ రెడ్డి భావమరిది సృజన్ రెడ్డికి ఈ టెండర్లు అక్రమంగా కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపిస్తున్నారు. ఇవే కాకుండా మరిన్ని కుంభకోణాలు రాబోతున్నాయని టీజర్ కూడా ఇచ్చేశారు. సీరియల్ మాదిరి అన్ని శాఖల్లో జరిగిన అవినీతిని వెలికి తీస్తామని హెచ్చరిం చారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలను జాతీయ స్థాయిలోనే ఎండగడతామని ఎన్నిసార్లు అయినా ఢిల్లీ వస్తామని అన్నారు. కేటీఆర్ ఢిల్లీ వెళ్లి హడావిడి చేస్తున్న సమయంలోలోనే సీఎం రేవంత్ రెడ్డి కూడా మగంళవారం ఢిల్లీ పర్యటన ఆసక్తిని రేపుతోంది. దీపావళి తర్వాత మంత్రివర్గ విస్తరణ ఉంటుందని కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తున్నారు. ఈ అంశంపై పార్టీలో చాలా పెద్ద చర్చ జరుగుతోంది. మరోవైపు త్వరలోనే ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుంది. ఈ అభ్యర్థులను కూడా ఖరారు చేయాల్సి ఉంది. వీటితోపాటు ఈ మధ్య కాలంలో రేవంత్ రెడ్డిపై ప్రతిపక్షం బీఆర్‌ఎస్ తీవ్ర ఆరోపణలు చేస్తూ వస్తోంది. ఇప్పుడు ఏకంగా కేంద్రమంత్రులకే ఫిర్యాదులు కూడా చేసింది. ఇన్ని అంశాలు ప్రచారంలో ఉండగా ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లడం ఆసక్తిని కలిగిస్తోంది. కేవలం అధిష్టానం పెద్దలను కలవడానికే ఢిల్లీకి వస్తున్నారని అందరికీ తెలిసిందే. ఈ మధ్య మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రేవంత్ ఆ విషయంలో కాంగ్రెస్ అధిష్టానానికి ఏమైనా ఫీడ్ బ్యాక్ ఇచ్చే అవకాశం ఉంది.సీఎం రేవంత్ రెడ్డి, ప్రతిపక్ష ఎమ్మెల్యే కేటీఆర్ ఢిల్లీలో ఉండగానే తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ ఢిల్లీ వెళ్లడం చర్చనీయాంశం అవుతోంది. ఫార్ములా ఈ- కార్ రేస్ కేసులో కీలక మలుపు తిరుగుతుందని కీలక వ్యక్తులను విచారించేం దుకు అనుమతి ఇవ్వాలని గవర్నర్‌కు దర్యాప్తు సంస్థలు విన్నవించుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ కేసులో కీలకంగా కేటీఆర్ పేరు వినిపిస్తోంది. ఈ విషయంపై ఇంకా గవర్నర్ ఎలాంటి అనుమతి ఇవ్వలేదు. ఈ అంశంపై క్లారిటీ కోసం ఢిల్లీ వెళ్లారా లేకుంటే సాధారణంగా వెళ్లారా అనే చర్చ జరుగుతోంది. మొత్తంగా రేవంత్‌పై ఆరోపణలతో తమ తప్పులను కప్పిపుచ్చుకునే భారీ యత్నాల్లో కెటిఆర్ ఉన్నారు. ఆయన ఢిల్లీ పెద్దల కాళ్లు పట్టుకోవడానికే వెళ్లారని మంత్రులు పొన్నం, పొంగులేటిలు ఇప్పటికే ఆరోపించారు.

# గిరిజనులపై దాడుల చేయడం దుర్మార్గం

**మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్**

మహబూబాబాద్, నవంబర్ 12 : సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గ కొడంగల్‌లోని లెగచెర్లలో గిరిజనులపై పోలీసులు దాడులు చేయడం అమానుషమని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు. మంగళవారం మహబూబాబాద్ పట్టణంలోని ఎమ్మెల్సీ నివాసంలో మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్‌లో 13వేల ఎకరాల భూమి ఉండగా, ఇక్కడ కాదని కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో ఫార్మా కంపెనీ తీసుకొచ్చేందుకు రేవంత్ రెడ్డి ఎందుకు ఆరాటపడుతున్నారని ఆమె ప్రశ్నించారు. పచ్చని పొలాల మధ్య ఫ్యాక్టరీ పెట్టడం వల్ల పొల్యూషన్‌తో చుట్టుపక్క గ్రామాల ప్రజలకు ఇబ్బంది వాటిల్లుతుందని నిన్న అధికారులు పోతే రైతులు అడ్డగించారన్నారు. రైతుల బాధలను అర్థం చేసుకోకుండా అర్ధరాత్రి పోలీసులు వేల సంఖ్యలో వెళ్లి గిరిజనులను అరెస్టు చేసి కొట్టడాన్ని కొట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తు న్నాం. నీ సొంత నియోజకవర్గంలోనే రైతులను మెప్పించలేని రేవంత్ రెడ్డి రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రజలను ఎలా మెప్పిస్తారని ఆమె సూటిగా ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం తెలంగాణ ప్రజలు చేసుకున్న పాపమా అని నిలదీశారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన పథకాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి ప్రజలే బుద్ధి చెప్పాలన్నారు. ప్రజలను ఇబ్బంది పెడుతున్న సీఎం రేవంత్‌పైనే కేసులు పెట్టాలన్నారు. రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత 11 నెలల కాలంలో ఇప్పటికీ 25 సార్లు ఢిల్లీ వెళ్లారని, ఆరోపించారు. ప్రజల సమస్యలు పక్కకు పెట్టి హైదరాబాద్ నుంచి ఢిల్లీకి, ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చెక్కర్లు కొట్టడమే సరిపోతుందని విమర్శించారు. ఇప్పటికైనా లగచర్లలోని గిరిజన రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేసి వారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రానున్న రోజుల్లో ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు.

## బిజెపిని గద్దెదించినపుడే ఉద్యోగావకాశాలు

కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. గేటువద్దే కమిషన్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. వారికి మద్దతుగా మాజీ సిఎం అఖిలేష్ యాదవ్ ఎక్స్‌లో స్పందించారు.అన్యాయంగా బుల్డోజర్‌ను ప్రయోగించే బిజెపి.. మెరుగైన పాలన సాగించి వుంటే విద్యార్థుల ఆగ్రహానికి భయపడి ఇళ్లలో దాక్కునే అవసరం వచ్చేది కాదని అన్నారు. సంవత్సరాలుగా ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకపోవడంతో నిరుద్యోగుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. బిజెపి ప్రభుత్వ తీరుతో విద్యార్థులు రోడ్లపైకి రావాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని అఖిలేష్ పేర్కొన్నారు. విద్యార్థుల పై లాఠీ చార్జ్ చేసిన అసమర్థ ప్రభుత్వం ఉత్తరప్రదేశ్‌లో అధికారం లోకి ఉండటానికి వీల్లేదని అన్నారు. ఉద్యోగాల కల్పన అనేది వారి అజెండాలో లేదని మండిపడ్డారు.విద్యావంతులు, ఉద్యోగాలు చేసే మధ్యతరగతి ప్రజలు ఇకపై బిజెపి భావోద్వేగాలకు లొంగిపోరని అన్నారు. ఒకప్పుడు వాట్సాప్ గ్రూపుల్లో బిజెపి తప్పుడు ప్రచారానికి బలైన వారి తల్లిదండ్రులు బిజెపి వారిని మానసికంగా ఎలా ఉపయోగించుకుందో ఇప్పుడు తెలుసుకుంటున్నారని తెలిపారు. బిజెపి చేస్తున్న విభజన, మత రాజకీయాలను ప్రజలు తిరస్కరిస్తున్నా రని, మంచి రాజకీయాల వైపు చూస్తున్నారని అన్నారు. బిజెపికి మానసిక బానిసలుగా ఉండేందుకు ఎవరూ సిద్ధంగా లేరని స్పష్టం చేశారు.

## శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్న హరీశ్‌రావు

రాజన్న సిరిసిల్ల, : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు మంగళవారం దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆలయ అర్చకులు హరీశ్ రావుకు ఘన స్వాగతం పలికారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కాగా, మంగళవారం కోరుటల్లో ఉదయం 8 గంటలకు కోరుట్ల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యే రైతు పాదయాత్ర వెంకటాపూర్, మేడిపల్లి, తాటిపెల్లి, చల్‌గల్ మీదుగా జగిత్యాలకు చేరుకోనున్నది. చల్‌గల్ సమీపంలో హరీశ్ రావు పాదయాత్రకు సంఘీభావం తెలియజేసి, అక్కడి నుంచి జగిత్యాల జిల్లా కేంద్రానికి వచ్చి సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం కలెక్టరేట్‌కు వెళ్లి వినతిపత్రం సమర్పించనున్నారు.

## అమృత్ టెండర్ల అవినీతిపై ఆధారాలున్నాయ్

మొదటిపేజీ తరువాయి...

కొడంగల్ ఫార్మాతో ప్రజలకు విషం ఇస్తున్నారని చెప్పారు. కుటుంబ సభ్యులకు కాంట్రాక్టులు అప్పగిస్తే అధికార దుర్వినియోగం కాదా అని ప్రశ్నించారు. తెలంగాణలో ఆర్‌ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని వెల్లడించారు. ఆర్‌ఆర్ అంటే రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ ట్యాక్స్ అని చెప్పారు. రాహుల్, కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంలా మారిందన్నారు. రాష్ట్రంలో తప్పులు జరుగుతున్నాయని ఆధారాలతో వివరాలు ఇస్తున్నామని తెలిపారు. అల్లుడి కోసం కొడంగల్‌ను బలి పెట్టే పరిస్థితి తలెత్తిందని చెప్పారు. అందుకే కొడంగల్‌లో తిరుగుబా టు మొదలైందన్నారు. రుణమాఫీ, రైతుబంధుకు డబ్బులు లేవంటు న్నారు. మహారాష్ట్రలో సిగ్గులేకుండా రూ.300 కోట్ల తెలంగాణ సొమ్ముతో ప్రకటనలు ఇచ్చారని విమర్శించారు. పొగులేటి కంపెనీకి రూ.4,300 కోట్ల పనులు అప్పగించారని చెప్పారు. రేవంత్ సర్కార్‌పై కేంద్రంఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సోనియా, చౌహాన్ సహా చాలా మంది పదవులు కోల్పోయారు. రేవంత్ రెడ్డి, పొంగులేటి పదవులు కూడాపోతాయన్నారు.మేంఢిల్లీకివస్తే మీకెందు కు భయం అని కాంగ్రెస్ పార్టీని ఉద్దేశించి అన్నారు. ప్రధాన ప్రతిప క్షంగా తాము ఢిల్లీకి వస్తామని, దేశ ప్రజల దృష్టికి ప్రభుత్వ మోసా లను తీసుకొస్తామన్నారు. మీ ఆరోపణలపై మీకు నమ్మకం ఉంటే విచారణ జరిపించాలని తెలిపారు. తెలంగాణలో జరుగుతున్న

# ఉత్తరప్రదేశ్‌లోని ఇటావాలో దారుణం

**భార్య, ఇద్దరు, కుమార్తెలు, ఒక కుమారుడికి విషం ఇచ్చిన వ్యక్తి**

లక్నో, నవంబర్ 12 : ఉత్తరప్రదేశ్‌లోని ఇటావాలో దారుణం జరిగింది. ఓ జ్వలరీ వ్యాపారి.. నలుగురు కుటుంబ సభ్యులకు విషం ఇచ్చి చంపాడు. ముకేశ్ వర్మ అనే వ్యక్తి తన భార్యకు, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడికి విషం ఆహారం ఇచ్చాడు. నలుగుర్ని చంపిన తర్వాత రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోబోయాడు. అయితే అతన్ని ఆర్పీఎఫ్ సిబ్బంది రక్షించింది. కూతుళ్లను చంపిన జ్వల్లర్ ముకేశ్ కుమార్ .. వాళ్ల ఫోటోలను తన వాట్సాప్ స్టేటస్‌లో అప్‌లోడ్ చేశాడు. ఆ స్టేటస్‌ను ఇతర కుటుంబసభ్యులు వీక్షించారు. ఆ తర్వాత ఇంట్లోని రూముల్లో వాళ్ల మృతదేహాలను గుర్తించారు. భార్య రేఖ, కుమార్తెలు భవ్య (22), కావ్య (17), అభిషిత్ (12) శవాలు.. నాలుగు అంతస్థుల భవనంలోని ఓ రూమ్‌లో లభించాయి. ఆ బిల్డింగ్‌లోనే తన సోదరులతో కలిసి జ్వలర్ ముకేశ్ కుటుంబం నివసిస్తోంది. కుటుంబసభ్యులతో తగాదా రావడం వల్లే ముకేశ్ వర్మ తన భార్య, పిల్లలను హతమార్చినట్లు తెలుస్తోంది. కుటుంబాన్ని చంపిన తర్వాత రైల్వే స్టేషన్ వద్ద మరుదార్ ఎక్స్‌ప్రెస్ కింద పడి ఆత్మహత్య చేసుకునే ప్రయత్నం చేశాడతను. ముకేశ్‌కు స్వల్ప గాయాలైనట్లు పోలీసులు చెప్పారు. కుటుంబసభ్యుల మృతదేహాలను పోస్టుమార్టమ్‌కు పంపినట్లు తెలిపారు. సోమవారం రాత్రి పది గంటల సమయంలో విషపూరిత పదార్థాన్ని భార్యా, పిల్లలకు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఫోరెన్సిక్ బృందాలతో కలిసి ఎస్పీ అభయనాథ్ త్రిపాఠి దర్యాప్తు నిర్వహించారు. ఢిల్లీలో ముకేశ్ గోల్డ్ ట్రేడింగ్ చేస్తుంటాడు. దీంతో అతను ప్రతి వారానికి ఒకసారి ఢిల్లీ వెళ్లి వస్తుంటాడు. అతని పెద్ద కూతురు భవ్య కూడా ఢిల్లీలో చదువుతోంది. ఆమె దివాళీ కోసం ఇంటికి వచ్చింది. కావ్య మాత్రం 12వ గ్రేడ్ చదువుతోంది. పెద్ద కూతురు భవ్య మొదటి భార్యకు జన్మించింది. ఆమె పెళ్లి అయిన రెండేళ్లకు మరణించింది. ఆ తర్వాత రెండవ భార్యతో ఇద్దరు పిల్లలను కన్నాడతను.

## కాలుష్య కోరల్లో చిక్కుకున్న ఢిల్లీ

రోజురోజుకూ గాలి నాణ్యత క్షీణిస్తుండటంతో రాజధాని వాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. శ్వాస తీసుకోవడం వంటి అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో రాజధానిలో కాలుష్య స్థాయిలు ప్రమాదకరంగా మారుతుండటంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితికి దీర్ఘకాలిక పరిష్కారాన్ని చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. 'గత 25 ఏళ్లుగా ఢిల్లీలోనే ఉంటున్నాను. ఇటీవలే కాలంలో రాజధానిలో కాలుష్యం తీవ్రమవుతోంది. ప్రభుత్వం క్రాకర్స్‌పై మాత్రమే ప్రధానంగా దృష్టి పెడుతోంది. అయితే, దీనికి ప్రధాన కారణం సమీప రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను తగలపెట్టడమే' అని కర్తవ్య పథ్ వద్ద వరుణ్ అనే వ్యక్తి అన్నారు. మరో ఢిల్లీ నివాసి అంకిత్ సచ్‌దేవా మాట్లాడుతూ.. రాజధానిలో సౌకర్యాల కోసం ప్రభుత్వానికి పన్నులు కడుతున్నామన్నారు. అయినప్పటికీ ఈ పరిస్థితి ఉందన్నారు. నగరంలో కాలుష్య నివారణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గాలి నాణ్యత సున్నా నుంచి 50 మధ్య ఉంటే బాగా ఉన్నట్టు అర్థం. 51 నుంచి 100 వరకు ఉంటే సంతృప్తికరమైనదని, 101 నుంచి 200 వరకు ఉంటే మితమైన నాణ్యత, 201 నుంచి 300 ఉంటే తక్కువ నాణ్యత అని, 301 నుంచి 400 వరకు ఉంటే చాలా పేలవమైనదని, 401 నుంచి 500 ఉంటే ప్రమాదకరస్థాయిగా పరిగణిస్తారు. అయితే, గత కొంతకాలంగా ఢిల్లీలో గాలి నాణ్యత ప్రమాదకరంగా మారుతోన్న విషయం తెలిసిందే. పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను తగలపెట్టడానికి తోడు.. మంచు రాజధానిని కమ్మేయడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. కాలుష్య నియంత్రణకు పాలకులు ఎన్ని చర్యలు చేపట్టినా ఫలితం ఉండటం లేదు. రోజురోజుకూ గాలి నాణ్యత క్షీణిస్తోంది. ఈ కారణంగా నగర వాసులు తీవ్ర అనారోగ్య సమసల్యకు గురికావాల్సి వస్తోంది.

## మట్టి దిబ్బలు కూలి నలుగురి మృతి

మొదటిపేజీ తరువాయి...

స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు, స్థానిక అధికారులు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. మట్టిని తొలగించి మొత్తం 9 మంది మహిళలను బయటికి తీశారు. వారిని వెంటనే చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. వారిలో నలుగురు మహిళలు ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు తెలిపారు.గాయాలతో ఉన్న మిగతా ఐదుగురికి చికిత్స అందిస్తున్నారు. మట్టిదిబ్బ నిర్లక్ష్యంగా వదిలేసి నలుగురి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని కాస్‌గంజ్ జిల్లా కలెక్టర్ తెలిపారు. ఘటనపై యూపీ సీఎం యోగీ ఆదిత్యనాథ్ విచారం వ్యక్తం చేశారు.

## నేత్రదానం చేసిన రాంపర్తి సైదులు

పట్టణంలోని ఐలమ్మ నగర్ కు చెందిన రిక్షా కార్మికుడు రాంపర్తి సైదులు (40) అనారోగ్యంతో మంగళవారం ఉదయం మృతి చెందారు. కుటుంబ సభ్యులు లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు అధ్యక్షులు, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ నలగట్ల సత్యప్రకాష్ కు సమాచారం అందించడంతో వెంటనే భద్రాచలం ఏరియా హాస్పిటల్ వైద్యులను సంప్రదించారు. కుటుంబ సభ్యుల అనుమతితో సంబంధించిన వైద్యులు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఐ బాల్స్ కలెక్ట్ చేసుకున్నారు. మరణించి నేత్రదానం చేసిన ఆయనకు లయన్స్ క్లబ్ తరుపున ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం కుటుంబ సభ్యులకు దహన సంస్కారాల కోసం లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు అధ్యక్షులు సత్యప్రకాష్ రూ.2 వేలు, మేము సైతం మిత్ర మండలి చారిటబుల్ ట్రస్ట్ సంస్థ రూ.3 వేలు ఆర్థిక సాయం అందించి సంతాపం తెలిపారు.

# తప్పులు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలి

**● ఉమ్మడి జిల్లాల ఓటరు జాబితా పరిశీలకులు కె.సురేంద్ర మోహన్**

జననినాదం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:



తప్పులు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని ఉమ్మడి జిల్లాల ఓటరు జాబితా పరిశీలకులు కె.సురేంద్ర మోహన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకఅత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వరరావు లతో కలిసి ఎన్నికల అధికారులు, సహాయ ఓటరు నమోదు అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా ఓటరు జాబితా పరిశీలకులు మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమన్వయంతో స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని అన్నారు. రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ కేంద్రానికి తమ ఏజెంట్లను నియమించాలని, జాబితా రూపకల్పన పై అధికారుల సమన్వయంతో పని చేయాలని, 18 సంవత్సరాల వయసు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో తమ వివరాలునమోదు చేసుకునే విధంగా కఅషి చేయాలని తెలిపారు. జనవరి 1, 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరు నమోదుకు అర్హులని, పి.వి.టి.జి. గ్రామాలలో ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, స్వీప్ కార్యక్రమాలలో భాగంగా కళాశాలలో అంబాసిడర్లను నియమించి ప్రచారం నిర్వహించాలని,గిరిజన ప్రాంతాలలో స్వయం సహాయక సంఘాల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్ స్థాయి అధికారులను నియమించడం జరిగిందని, ఈనెల 28వ తేదీ వరకు ఓటరు నమోదు, మార్పులు, సవరణలు, తొలగింపుల కొరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, ఈ నెల 9, 10 తేదీలలో అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ శిబిరం నిర్వహించడం జరిగిందని తెలిపారు. తుది ఓటరు జాబితాను జనవరి 6, 2025 రోజున ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. అంతకుముందు మొదటిసారిగాజిల్లాకలెక్టరేట్‌కువచ్చినఓటరుజాబితాపరిశీలకులకుపుష్పగుచ్ఛంఅందజేశారు. ఈకార్యక్రమంలోరాజకీయపార్టీలపతినిధులు,విభాగం అధికారులు తదితరులు పాల్గన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**● జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి**

జననినాదం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:



ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వివిధ అనారోగ్య సమస్యలపై వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. మంగళవారం జిల్లాలోని వాంకిడి మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా అధికారులు కఅషి చేయాలని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటిస్తూ ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని తెలిపారు. అనంతరం మండలంలో కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే తీరును పరిశీలించారు. ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వేలో భాగంగా ఎన్యుమరేటర్లకు కేటాయించిన బ్లాక్ లలో గల అన్ని ఇండ్ల కుటుంబ సభ్యుల వివరాలను నిర్ణీత నమూనాలో కేటాయించిన అంశాల ప్రకారం స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. నిర్ణీత గడువులోగా సర్వే ప్రక్రియ పూర్తి చేసే విధంగా సూపర్ వైజర్లు పర్యవేక్షించాలని, సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. అనంతరం గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాల పరిసరాలు, గదులు, రిజిస్టర్ లను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థినులు అస్వస్థతకు గురి కావడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని, ఆహారం తయారీలో తాజా కూరగాయలు, సరుకులను వినియోగించాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావఅతం కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమాలలో ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. సీతారాం, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రమాదేవి, తహసిల్దార్ రియాజ్ అలీ, సర్వే మండల ప్రత్యేక అధికారి రాథోడ్ బిక్కు, మండల పరిషత్ అభివఅద్ధి అధికారి ప్రవీణ్ కుమార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గన్నారు.



# తిర్యాణి మండల వ్యవసాయ శాఖ అధికారిగా వినయ్

జననినాదం, తిర్యాణి 12



తిర్యాణి మండలం వ్యవసాయ శాఖ నూతనఅధికారిగా వినయ్ మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని వ్యవసాయాధారిత మ సమస్యల పరిష్కారం కోసం తన వనతుగా కృషి చేస్తానని అన్నారు. రైతులు ఏ సమస్య ఉన్న తనని సంప్రదించవచ్చని తెలిపారు.

# అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి

**జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్**

జననినాదం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:

జిల్లాలో దివ్యాంగుల సంక్షేమాన్ని నిర్వహించే ఆశ్రమాలు, పాఠశాలలు, వివిధ సంస్థలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా దివ్యాంగుల, వయోవఅద్ధుల, ట్రాన్స్ జెండర్ల సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతి లేకుండా ఆశ్రమాలు, సంస్థలు నిర్వహించినట్లయితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. దివ్యాంగుల సంక్షేమ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ కొరకు ఈనెల 14వ తేదీ లోగా జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈనెల 15వ తేదీ తర్వాత రిజిస్ట్రేషన్ లేని సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇతర వివరాలకు టోల్ ఫ్రీ నెంబర్ 155326 లో సంప్రదించవచ్చని తెలిపారు.

# జిల్లా కలెక్టర్, అందరూ పై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

**♦ ఉద్యోగ సంఘాల నాయకులు**

జననినాదం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:



వనపర్తి జిల్లాలో దుద్యాల మండలంలో భూసేకరణలో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, రాజస్వ మండల అధికారి, తహసిల్దార్ లపై దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఉద్యోగ సంఘాల నాయకులు కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకఅత జిల్లా కలెక్టరేట్ భవన ఆవరణలో అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారులపై దాడికి పాల్పడ్డారని, ఈ నేపథ్యంలో సామాన్య ఉద్యోగికి భద్రత లేదని,అధికారులపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అధికారులు, ఉద్యోగుల మనోధైర్యం దెబ్బతినకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ల సంఘం నాయకులు మధుకర్, ప్రమోద్, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, పంచాయతీరాజ్ ఉద్యోగులు, కలెక్టరేట్ లోని అన్ని విభాగాల, శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గన్నారు.

# జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

**♦ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్**

జననినాదం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నందు వివిధ పోస్టుల భర్తీకి అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఒక ప్రకటనలో తెలిపారు. స్టెనో - టైపిస్ట్-1, టైపిస్ట్- కమ్ - అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్-1 పోస్టులను భర్తీ చేయడం జరుగుతుందని, ఈ నెల 22వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, న్యాయ సేవా సదన్, జిల్లా న్యాయస్థానం-కుమ్రంభీం ఆసిఫాబాద్ కు చేరే విధంగా రిజిస్టర్డ్ పోస్ట్ / కొరియర్ ద్వారా మాత్రమే పంపించాలని, నేరుగా దరఖాస్తులు స్వీకరించబడవని, అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే పోస్ట్ వివరాలు కవర్ పై తప్పనిసరిగా రాయాలని తెలిపారు. ఈ నెల 23 నుండి 28వ తేదీ వరకు దరఖాస్తులను పరిశీలించి,అర్హులైన అభ్యర్థులకు డిసెంబర్ 2వ తేదీన హాల్ టికెట్లు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. డిసెంబర్ 7వ తేదీ ఉదయం 10.30 గంటలకు రికార్డ్ అసిస్టెంట్, మధ్యాహ్నం 3 గంటలకు స్టెనో - టైపిస్ట్, టైపిస్ట్-కమ్ - అసిస్టెంట్ పోస్టులకు జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయస్థానం భవన సముదాయంలో వ్రాత పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఏ స్థాయిలోనైనా సదరు నోటిఫికేషన్ ను రద్దు చేసే అధికారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కలిగి ఉంటారని తెలిపారు. ఇతర వివరాలకు. వెబ్ సైట్ లో సంప్రదించవచ్చని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని తెలిపారు.

# కలెక్టర్, రెవెన్యూ సిబ్బందిపై దాడిని ఖండించాలి

జననినాదం, తిర్యాణి 12



వికారాబాద్ జిల్లాలో కలెక్టర్ మరియు రెవెన్యూ సిబ్బందిపై దాడిని ఖండిస్తూ మంగళవారం రోజున తాసిల్దార్ సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తంచేశారు.ఈసందర్భంగా తహసిల్దార్ సూర్య ప్రకాష్ మాట్లాడుతూ విధుల్లో ఉన్న కలెక్టర్ మరియు రెవెన్యూ సిబ్బందిపై దాడి చేయడం అమానుషమని తెలిపారు. దాడికి పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ వంశీకఅష్ణ ఆర్ ఐ రాజేష్ జూనియర్ అసిస్టెంట్ సాయి కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్, బానేష్, గణేష్,సంపత్ ప్రేమ్, తదితరులు పాల్గొన్నారు.

# సర్వే ప్రక్రియలో ప్రతి కుటుంబ వివరాలు నమోదు చేయాలి


**ఆసిఫాబాద్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ అజ్మీరా శ్యామ్ నాయక్**

జననినాదం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియలో జిల్లాలోని ప్రతి కుటుంబం వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ అజ్మీరా శ్యామ్ నాయక్ అన్నారు. ఆదివారం జిల్లాలోని కెరమేరీ మండలం దేవాపూర్ గ్రామంలో కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే ప్రక్రియలో కుటుంబ సభ్యుల వివరాలు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన బ్లాక్ లలో పూర్తిస్థాయిలో కుటుంబ సభ్యుల వివరాలు నిర్ణీత నమూనాలు స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. నిర్దేశించిన ఫారంలో ప్రతి అంశాన్ని ప్రజల వద్ద నుండి తప్పనిసరిగా సేకరించాలని, అందుబాటులో లేని వారి ఇంటికి మరొకసారి తప్పనిసరిగా వెళ్లాలని, ఒక్క కుటుంబం కూడా మినహాయింపు కాకూడదని తెలిపారు. సర్వే ముందు రోజు ఏ ప్రాంతంలో సర్వే నిర్వహిస్తున్నారో సంబంధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని, సర్వే లక్ష్యాన్ని సాధించవలసిన బాధ్యత ఎన్ని ఓటర్ల పై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గన్నారు.

# ఉసిరి శివస్వరూపం... అందుకే కార్తీక దీపం



తిరుమల,నవంబర్12 :కార్తీక మాసానికి, ఉసిరి మధ్య ఉన్న సంబంధం అంతాఇంతా కాదు. కార్తిక మాసంలో ఉసిరికి ఎంతో ప్రాధాన్యత ఉంటుందని తెలిసిందే. కార్తిక మాసం వచ్చిందంటే చాలు చాలా మంది శైవ క్షేత్రాల్లో ఉసిరితో దీపాలను వెలిగిస్తుంటారు. ఇక కార్తిక పౌర్ణమి రోజు స్నానం చేసే నీటిలో ఉసిరి వేసుకొని స్నానం చేస్తారననే విషయం తెలిసిందే. పురాణాల ప్రకారం ఉసిరి చెట్టును ఈశ్వర స్వరూపంగా భావిస్తారు. అందుకే ఈ మాసంలో ఉసిరి చెట్టును పూజిస్తారు. ముఖ్యంగా ఉసిరి చెట్టు కింద దీపాలను వెలిగిస్తుంటారు. ఇలా చేయడం వల్ల కష్టాలన్నీ దూరమై మంచి జరుగుతుందని విశ్వసిస్తుంటారు. వ్యాస మహర్షి రచించిన శివమహాపురాణంలో ఈ విషయాలను వెల్లడించారు. ఇక ఉ సిరికాయ అంటే లక్ష్మీదేవికి కూడా ప్రతిరూపమని భావిస్తుంటారు. అందుకే కార్తిక మాసంలో ఉసిరి దీపం వెలిగిస్తే లక్ష్మీదేవీ అనుగ్రహం లభిస్తుందని విశ్వసిస్తారు.ఇక కార్తిక పౌర్ణమి రోజున ఉసిరి దీపాలను వెలిగించడం ఎంతో మంచిదని చెబుతుంటారు. ఈ రోజు ఉసిరి దీపాన్ని వెలిగించడం వల్ల శ్రీ మహావిష్ణువు అనుగ్రహం కూడా లభిస్తుందని భక్తులు విశ్వసిస్తారు. అలాగే కార్తిక పౌర్ణమి రోజున ఉసిరి దీపాన్ని వెలిగిస్తే నవగ్రహ దోషాలు తొలగిపోతాయని చెబుతుంటారు. కార్తిక మాసంలో ఉసిరి దీపాన్ని వెలిగించే సమయంలో కొన్ని నియమాలు పాటించాలని పండితులు చెబుతున్నారు. శివాలయం లేదా విష్ణు ఆలయ ప్రాంగణంలో నీటితో శుభ్రం చేసి వరిపిండితో ముగ్గు పెట్టాలి. ముగ్గును పసుపు కుంకుమలతో, పూలతో అలంకరించాలి. తరువాత ఉసిరికాయను తీసుకుని, పై భాగంలో గుండ్రంగా తొలిచి, ఆ తర్వాత అందులో నెయ్యిని నింపాలి. ఆ తర్వాత తామర కాడలతో తయారైన వత్తులను వేసి దీపాన్ని వెలిగించాలి. దీపాన్ని పసుపు కుంకుమలతో, అక్షింతలతో అలంకరించాలి.

# తిర్యాణి మండలంలో పెయింటింగ్ సంఘం

**నూతన కార్యవర్గం ఎన్నిక**

జననినాదం, తిర్యాణి 12



తిర్యాని మండలంలో మంగళవారం రోజున రోజున పెయింటింగ్ సంఘం ఏకగ్రీవ ఎన్నిక నిర్వహించినట్లు సభ్యులు తెలిపారు. అధ్యక్షునిగా చిలుక వినోద్ ఉపాధ్యక్షునిగా బూసి అరుణ్ గౌరవ అధ్యక్షునిగా నల్లూరు రాజు సభ్యులు పున్నం హరీష్ కుమార్, మెరుగురాకేష్, బూసి ప్రశాంత్, చిట్యాల అనిల్, ఎన్నుకున్నట్లు వారు పేర్కొన్నారు.

# జననినాదం

బుధు వారం
13-11- 2024




# ఆదివాసుల జీవన ఉపాధి కోసం నాబార్ చేయూత

- నాబార్డ్ చీఫ్ జనరల్ మెనెజర్ ఉదయ్ భాస్కర్
- సిర్పూర్,టి ఎమ్మెల్యే పాల్వాయి హరిష్ బాబు



మాట్లాడాతు నాబార్డ్ చీఫ్ జనరల్ మెనెజర్ ఉదయ్ భాస్కర్

జననినాదం,సిర్పూర్(యు)12: ఆదివాసులకు జీవన ఉపాధి అవకాశాలు కల్పించెందుకు నాబార్డ్ నిధులలతో ఏకలవ్య ఫౌండేషన్ చేయుత ఇస్తుంతునే తెలంగాణ నాబార్డ్ చీఫ్ జనరల్ మెనేజర్ ఉదయ్ భాస్కర్ అన్నారు. మంగళవారం సిర్పూర్(యు) మండల కేంద్రంలోని బాబ్జిపేట గ్రామలలో ఏకలవ్యనాబార్డ్ద్వారాసమావేశంనిర్వహించారు. వారు మాట్లాడాతు సిర్పూర్(యు),లింగాపూర్ మండలలో ఐదువందలమందిలబ్బిడదారులకు ఏకలవ్య ఫౌండేషన్ ద్వార ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా సిర్పూర్(యు) మండలంలోని పెద్ద దోబ్బ గ్రామం ఎనుకోవడంతో ఆక్కడ ఉన్న ఆదివాసులకు లబ్దికోరకు గ్రామలలో కిరాణ దుకాణం, పిండిగిర్ని, మేకల రుణాలు మంజురు చేయడంజరిగిందన్నారు.కాగా 85లక్షల 30వేల రుపాయలు వెచ్చించి 85 మంది లబ్బిదారులకు సిజిఎం ఉదయ్ భాస్కర్ (సిర్పూర్,టి) ఎమ్మెల్యే పాల్వాయి హరిష్ బాబు, భీం మనుమడు కుంరం సోనేరావ్,లు పంపిణీ చేశారు. అంతకు ముందు ఆదివాసులు పెద్ద ఎతున్న అధికారులకు ఘనంగా స్వాగతం పలికారు. అదేవింగా అమర వీరుడు కుంరం భీం విగ్రాహనికి నాబార్ చీఫ్ జనరల్ మెనేజర్ ఉదయ్ భాస్కర్, ఎమ్మెల్యే పాల్వాయి హరిష్ బాబు పూల మాలలు వేసి నివాళ్ళులు అర్పించారు. ఆనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాబార్డ్ సీజీఎం ఉదయ్ భాస్కర్, మాట్లాతు గిరిజన ప్రాంతంలో ఆదివాసులను పూర్తి స్థాయిలో అభివృద్ది చేసేందుకు నాబార్డ్ సంస్థ ప్రత్యేక ప్యాకేజి కిందనిధులు మంజులు చేసి వివిధ పథకాలను ఏకలవ్య ఫౌండేషన్ ద్వార అమలుచేపడుతున్నామనిపేర్కోన్నారు.ముఖ్యంగా ఈ ప్రాంతంలో రోడ్ల వ్యవస్థ అధ్వాన్నంగా ఉ ఒదని,నాబార్డ్ నిధులతో రోడ్లు బాగు చేస్తామన్నారు. అదేవిధంగా విద్యార్థులకు చదువు,వ్యవసాయం, ఈరిగేషన్, త్రాగునీటి కోసంఅధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. గిరిజన భూములకు సాగు అదేలా ప్రాజేక్టులు మంజూరు చేసెందుకు ప్రణాళిక బద్దంగాముందుకుసాగుతామన్నారు.అదేవిధంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 22 రైతు ఉత్పాదక సంఘాలు పని చేస్తున్నాయని, అసిఫాబాద్ జిల్లాలో 7రైతు ఉత్పాదక సంఘాలు ఉన్నాయని తెలిపారు. రైతులకు డ్రోన్ పైలట్ప్రాజెక్ట్ అందించడం జరుగుంతుందని వాటి నిర్వాహణ ఏకలవ్య ఫౌండేషన్ చూసుతుందన్నారు. అదేవిధంగా రైతు ఉత్పాదక సంఘాలకు మార్కేటింగ్ సదుపాయం కల్పించడం జర్గుతుందన్నారు. ఈ ప్రాతంలో ఏకలవ్య ఫౌండేషన్ విస్తరించడంతో పేదలకు నాబార్డ్ నిధుల అర్థికంగా అనేక విధాలుగా ఉపయోగ పడుతున్నాయని అయన అన్నారు.ముఖ్యంగా మహిళ సంఘాలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని అయన వివరించారు. కుంరం సోనేరావ్ మాట్లాడాతు జల్,జంగల్ జమీన్ కోసం జోడేఘాట్ కేంద్రంగా కుంరంభీం ఉద్యమాలు చేసి అసువులు బాశారని, ఇప్పటికి తమకు అన్ని ఉన్న గ్రామలలో నీరు లేదన్నారు. ప్రభుత్వం గిరిజన ప్రాంతం పై ప్రత్యేక దృషి సారించి అధివృద్ది పనులు మంజూరు,చేయాలని కోరారు. సిర్పూర్(టి) ఎమ్మెల్యే పాల్వాయి హరిష్ బాబు మాట్లాడాతు అదివాసులు ధర్మ సంస్కృతిని కాపాడుకుంటు క్రమంగా అభివృద్దికి బాట వేయాలని సూచించారు. ఈ ప్రాంతంలో పూర్తి స్థాయిలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ అమలు చేస్తే క్రమంగా అభివృద్ది జరుగుతుందని ప్రభుత్వం పునరాలోలించి ఇట్టి నిధులను మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్యఫౌండేషన్ చైర్మన్ వెంకటరావు,ట్రిస్టీస్ రాంరెడ్డి, ఆర్ దిగాంబర్, సీఈవో, మధుకర్,విజేయ్, ఆత్రం భీంరావు స్వామి, ఆదిలాబాద్,ఆసిఫాబాద్జల్ల సిబ్బంది,మాజీ సర్పంచులు, వివి గ్రామలనుండి వచ్చిన పటెల్,తదితరులుపాల్గోన్నారు.


కిరాణ దుకాణం, ప్రారంభించిన దృష్ట








# కర్షకుని చూపు.. పొగాకు వైపు..

ఈ ఏడాది వర్జినియా పొగాకు కిలో ధర రూ.300పైగా దాటడం, వైట్‌బర్లీ కూడా కిలో రూ.140 నుంచి రూ.160 వరకు ధర పలకడంతో రైతులు బాగా లాభపడ్డారు. ప్రస్తుతం ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు పొగాకు సాగు వైపు మొగ్గుచూపుతున్నారు. సాధారణంగా పొగాకు సాగు చేయాలంటే ఎకరాకు గరిష్ఠంగా రూ.లక్ష వరకు ఖర్చవుతుంది. ఇందులో రూ.20 వేలు పొలం కౌలు, నారు రూ.9 వేలు, నీటితడులకు రూ.6 వేలు, కలుపు రాకుండా రూ.7వేలు, ఎరువులు/నీళ్ల మందులు కలిపి రూ.8వేలు, కోత కూలీ రూ.40 వేలు, పురికొసలు/కర్రలు రూ.10 వేల వరకు ఖర్చవుతుంది. అనుకున్న విధంగా పంట దిగుబడి వచ్చినట్లయితే కనిష్ఠంగా ఎకరాకు 13 క్వింటాళ్ల దిగుబడి ఖాయంగా వస్తుంది. సరాసరిన క్వింటా వైట్‌బర్లీ పొగాకు ధర రూ.15 వేలు పలుకుతున్న నేపథ్యంలో రైతుకు ఎకరాకు రూ.1.95 లక్షల వరకు ఆదాయం సమకూరుతుంది. రూ.లక్ష ఖర్చు పోను నికరంగా రూ.95 వేల వరకు ఆదాయం సమకూరుతుంది. అత్యధికంగా వైట్‌బర్లీ సాగు: జిల్లా పరిధిలోని వైట్‌బర్లీ పొగాకు పెద్దఎత్తున సాగు చేస్తున్నారు. జే.పంగులూరు మండలంలో గతేడాది 1300 ఎకరాల్లో వైట్‌బర్లీ సాగు చేశారు. ప్రస్తుతం ఈ సంఖ్య నాలుగు వేల ఎకరాలకు చేరింది. ఇంకొల్లు మండలంలోనూ ఇలాంటి పరిస్థితి నెలకొంది. అద్దంకి మండలం జార్లపాలెం, చెరువుకొమ్ముపాలెం, ఉత్తర అద్దంకిలో కలిపి గతేడాది రెండు వేల ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది మూడు వేల ఎకరాలకు పెరగనుంది. జే.పంగులూరు, ఇంకొల్లు మండలాల్లో అత్యధికంగా మిరప, శనగ పంటలు సాగు చేసేవారు. ఆ పంటలపై నమ్మకం సన్నగిల్లిన రైతులు కనీస గ్యారెంటీ పంటగా ఉన్న వైట్‌బర్లీ వైపు మొగ్గు చూపుతున్నట్లు జే.పంగులూరు, అద్దంకి మండల వ్యవసాయాధికారులు డి.సుబ్బారెడ్డి, కె.వెంకటకృష్ణ పేర్కొన్నారు. జిల్లాలో పొగాకు సాగు విస్తీర్ణం ఈ ఏడాది



భారీగా పెరిగింది. తక్కువ ఖర్చు తోడు, మంచి ధర లభించడంతో పొగాకు సాగు వైపు రైతాంగం మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో భూముల కౌలు, ఖర్చులు కూడా గణనీయంగా పెరిగాయి. జిల్లాలోని జే.పంగులూరు, ఇంకొల్లు, అద్దంకి, మార్టూరు, యద్దనపూడి, కొరిశపాడు, పర్చూరు, బల్లికురవ మండలాల్లో పొగాకు సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. మండలంలో రెండు వేల చొప్పున రమారమి 16 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు లెక్క తేలింది. గతేడాది సాగర్ నీరు రాకపోవడంతో వైట్‌బర్లీ పొగాకు సాగు చేశా. నారు కోసం ద్రోణాదుల, మురికిపూడి, అద్దంకి వెళ్లి తెచ్చుకున్నా. అయితే సొంతంగా నారుమడి ఎందుకు వేయకూడదనే ఉద్దేశంతో ఈ ఏడాది మూడి పెంచుతున్నా. డిమాండ్ బాగా ఉ ంది. గతేడాది 30 ఎకరాల్లో వైట్‌బర్లీ సాగు చేశా. సొంత పొలానికి తోడు కౌలుకు తీసుకుని పండించా. గతంలో శనగ, మిరప పంటలు సాగు చేసే వాళ్లం. అవి గిట్టుబాటు కావడం లేదు. రెండేళ్ల నుంచి వైట్‌బర్లీ సాగు చేస్తున్నా. కనీసం గ్యారెంటీగా ఉంటుంది.

# వైద్య కళాశాల నిర్మాణం సాగేనా?



బాపట్ల, :బాపట్లకు వైద్య కళాశాల మంజూరు చేస్తూ 2020 మార్చిలో అప్పటి వైకాపా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పట్టణ శివారున జమ్ములపాలెం రోడ్డులో 60 ఎకరాల అసైన్డ్ భూములను వైద్య కళాశాలకు రెవెన్యూ అధికారులు సేకరించారు. 2021 మే 31న ఐదొందల పడకల ఆసుపత్రి, వైద్య కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2023 డిసెంబరు నాటికే బోధనాసుపత్రి, వైద్య కళాశాల, విద్యార్థుల వసతిగృహాల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. 2024 జూన్ వరకు పునాది దశ దాటి ఫిల్లర్ల నిర్మాణం వరకు పనులు వచ్చాయి. దీంతో 2025-26లో ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభించాలన్న లక్ష్యం నీరుగారిపోయింది. ఈ నేపథ్యంలో బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ సచివాలయంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబును కలిసి వైద్య కళాశాల నిర్మాణ పనులు త్వరగా తిరిగి ప్రారంభించాలని కోరారు. జిల్లా కేంద్రంలో సరైన ఆసుపత్రి లేదని, వైద్య చికిత్స కోసం 60 కి.మీ. దూరంలోని గుంటూరు వెళ్లాల్సి వస్తోందని పరిస్థితిని వివరించారు. ఐదొందల పడకల బోధనాసుపత్రి వస్తే పది లక్షల మంది ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని తెలియజేశారు.గత వైకాపా ప్రభుత్వ నిర్వాకం కారణంగా బాపట్ల వైద్య కళాశాల, బోధనాసుపత్రి నిర్మాణ పనులు నత్తనడకన సాగాయి. శంకుస్థాపన చేసిన తర్వాత మూడేళ్లలో కేవలం పునాది దశ పనులు మాత్రమే చేశారు. నాబార్డు మంజూరు చేసిన రూ.252 కోట్ల రుణంలో గుత్తేదారుడికి కేవలం రూ.20 కోట్లు మాత్రమే బిల్లుల కింద చెల్లించారు. రూ.232 కోట్ల నిధులు దారి మళ్లించారు. బిల్లులు చెల్లించకపోవడంతో నెలన్నర క్రితం నిర్మాణ పనులను గుత్తేదారు సంస్థ నిలిపి వేసి యంత్రాలను ఇతర ప్రాంతాలకు తరలించింది. స్థానిక ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ చొరవ తీసుకుని వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబును కలిసి వైద్య కళాశాల, బోధనాసుపత్రి భవనాల నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. వైద్య కళాశాల నిర్మాణం పేరుతో నాబార్డు నుంచి అప్పటి ప్రభుత్వం రుణం తీసుకుంది. గుత్తేదారుడికి కేవలం రూ.20 కోట్లు మాత్రమే బిల్లులు చెల్లించి రూ.49 కోట్లు పెండింగ్‌లో పెట్టింది. నాబార్డు నుంచి తీసుకున్న రుణాన్ని దారి మళ్లించి వాడేసింది. బిల్లులు చెల్లించలేదని గుత్తేదారు సంస్థ గత నెల మొదటి వారంలో నిర్మాణ పనులు నిలిపివేసింది. భారీ యంత్రాలను ఇతర ప్రాంతాలకు తరలించింది. ప్రజాప్రతినిధులు, అధికారులు విచారణ చేస్తే నాబార్డు నిధులను దారి మళ్లించిన విషయం వెలుగులోకి వచ్చింది. ఇటీవల కలెక్టర్లతో సీఎం చంద్రబాబు వెలగపూడి సచివాలయంలో నిర్వహించిన సదస్సులో వైద్య కళాశాల భవనాల నిర్మాణ తీరు, త్వరగా పూర్తి చేసి 500 పడకల బోధనాసుపత్రి ప్రారంభించాల్సిన అవశ్యకతను సీఎంకు కలెక్టర్ వెంకట మురళి వివరించారు. జిల్లాలోని ప్రాధాన్యం ప్రాజెక్టుల్లో దీనిని చేర్చారు.

# నూతన మార్కెట్ పాలక వర్గానికి శుభాకాంక్షలు...

## మంత్రి పొన్నం ప్రభాకర్, వోడితల ప్రణవ్...



జమ్మికుంట జననినాదం12 : కరీంనగర్ జిల్లా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ నూతన చైర్మన్,వైస్ చైర్మన్ నియమితులైన చైర్మన్ పుల్లూరి స్వప్న-సదానందం, వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, లను మార్కెట్ డైరెక్టర్లను రాష్ట్ర బీసీ సంక్షేమ,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ,హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ లు అభినందించారు రైతులకు అందుబాటులో ఉంటూ రైతు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని,మార్కెట్ లో ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని మార్కెట్ అభివృద్ధి కొరకు కృషి చేస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ సందర్భంగా అన్నారు..

# తెలంగాణ ఉద్యమకారుల గోడపత్రికను ఆవిష్కరించిన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత ఎమ్మెల్సీ అభ్యర్థి డా వి.నరేందర్ రెడ్డి

**కరీంనగర్,** కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఈనెల 27,28వ తేదీలలో జరగబోయే తెలంగాణ ఉద్యమకారుల విజయసంకల్ప మహాపాదయాత్ర కు సంబంధించిన గోడపత్రికలను మంగళవారం పార్టీ కార్యాలయం లో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత ఎమ్మెల్సీ అభ్యర్థి వి.నరేందర్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉ ద్యమకారుల అభ్యున్నతి కొరకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం 250 గజాల భూమితో పాటు ఉద్యమకారుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు..ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్త ఉద్యమకారులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతంచేయాలన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కరీంనగర్ జిల్లా చైర్మన్ కనకం కుమారస్వామి,కరీంనగర్ టౌన్ ప్రెసిడెంట్ గొడిశల రమేష్ గౌడ్, రాష్ట్ర నాయకురాలు ఐల ప్రసన్న కంజర్ల రేణుక ,మహాదేవుని భార్గవి ,మునక్కవిద్యాసాగర్,తిరుమలరెడ్డి, కనక లక్ష్మీ,అంజలి తార, విజయ తదితరులు పాల్గొనడం జరిగింది.

# ఉద్యోగుల పై దాడి హేయామైన చర్య -తహసీల్దార్ సునీత



మొగుళ్లపల్లి,జననినాదం12: వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో ఫార్మా కంపెనీ ఏర్పాటు విషయమై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో పాటు రెవెన్యూ అధికారులపై దాడి హేయామైనా చర్య అని మొగుళ్లపల్లి తహసిల్దార్ సునీత అన్నారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్, అధికారులపై జరిగిన దాడికి నిరసనగా మంగళ వారం తహసిల్దార్ కార్యాలయం ముందు రెవెన్యూ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ అధికారులపై రైతుల ముసుగులో అసాంఘిక శక్తులు దాడికి పాల్పడ్డాయని, విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపై దాడి హేయమైన చర్య అని, అధికారులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు.దాడికి ఉసిగొల్పిన, పాల్పడిన వారి మీద చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ సురేందర్ రెడ్డి తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గన్నారు

# విద్యార్థుల సృజనాత్మకు పట్టం కట్టిన అల్ఫోర్స్ కిడోస్ న్యాక్



కరీంనగర్,విద్యార్థులకు ప్రాథమిక దశ నుండి సృజనాత్మకతతో పాటు ఆలోచన విధానాన్ని పెంపొందించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. మంగస్థానిక కొత్తపెల్లి లోని ఆల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలలో చాలా వినూత్నంగా, సృజనాత్మకంగా ఏర్పాటు చేసినటువంటి అల్ఫోర్స్ కిడోస్ న్యాక్ను అట్టహాసంగా విద్యార్థుల ఆనందోత్సవాల మధ్య ఘనంగా ప్రారంభించారు. ప్రాంగణంలో జ్యోతి ప్రజ్వలన చేసి పాఠశాలలో ఏర్పాటు చేసినటువంటి వివిధ స్టాల్స్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని రకాలుగా ప్రోత్సాహంఅందించాలని, సృజనాత్మకతను పెంపొందించే అవసర ఎంతగానో ఉందని వారు చెప్పారు. విద్యార్థులకు వార్షిక ప్రణాళికలో భాగంగా ఎన్నో విషయాలను నేర్పాల్సిన అవసరం ఉంటుందని ఆ విషయాలను చాలా ఆలోచింపచేసే విధంగా బోధించినట్లయితే విద్యార్థులకు ఎప్పుడు కూడా గుర్తుంటాయని, పరీక్ష విధానంలో చాలా సులభంగా జవాబులు రాయచ్చని వారు చెప్పారు.

విద్యార్థులకు వినోదాత్మకంగా విద్యను అందించడం లక్ష్యంగా పాఠశాలలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తూ వారిలో దాగి ఉన్నటువంటి నైపుణ్యాన్ని వెలికి తీయడంలో సఫలీకృతులమవుతు న్నామని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాలలోని 3,4 మరియు 5 తరగతి విద్యార్థులు ఆలోచింపచేసే విధంగా ఆకర్షణీయంగా వివిధ రకాల ఆలోచనలతో సమాజ హితంగా చేస్తున్నటువంటి వివిధ కార్యక్రమాలను సమాజంలో ప్రభావితం చేసే పలు అంశాలను చాలా ప్రశంసనీయంగా వర్ణించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొని వారి యొక్క భావాలను తెలిపి సంతోషాన్ని రెట్టింపు చేసారు. అదేవిధంగా అహర్నిషలు కృషి చేస్తూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయడంలో కీలకంగా వ్యవహరిస్తున్న విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి కి ఉపాధ్యాయ బృందానికి తల్లిదండ్రులు శుభాభినందనలు తెలియజేశారు.

# గ్రూప్ -3 పరీక్ష సజావుగానిర్వహించాలి

**జిల్లాలో 33 సెంటర్లలో 9478 మంది అభ్యర్థులు**
**పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు**
**నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**



నాగర్ కర్నూల్, జననినాదం,నవంబరు 12:సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్–3 పరీక్ష నిర్వహణకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్, రూట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్, పోలీస్ అధికారులతో శిక్షణ తరగతులను నిర్వహించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్–3 పరీక్ష కోసం నాగర్ కర్నూల్ జిల్లాలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ...... నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంతో పాటు, బిజినపల్లి, తెలకపల్లి మండల కేంద్రాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 33 సెంటర్లలో 9478 మంది అభ్యర్థులు గ్రూప్ 3 పరీక్ష వ్రాయనున్నట్లు తెలిపారు. నవంబర్ 17న ఉదయం 10 గంటల నుంచి 12:30 వరకు జనరల్ స్టడీస్, జనరల్ ఎబిలిటీ పేపర్–1, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5:30 వరకు హిస్టరీ– పాలిటి – సోసైటి పేపర్–2, నవంబర్ 18న ఉదయం 10 గంటల నుంచి 12:30 వరకు ఎకానమీ డెవలప్ మెంట్ పేపర్ –3 పరీక్షలు నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష సమయానికి అరగంట ముందే పరీక్ష కేంద్రం గేటు మూసి వేస్తారని తెలిపారు. పరీక్ష రాసే అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించి పరీక్షా కేంద్రంలోని అనుమతించాలన్నారు. పరీక్ష కేంద్రాలలోకి ఎలక్ట్రానిక్ వస్తువులు, బంగారు, వెండి అనుమతి లేదన్నారు. సాధారణ చేతి గడియారం మాత్రమే అనుమతి ఉందన్నారు. కంటి చూపు లేని వారికి టీజీపీఎస్సీ మార్గదర్శకాలకు అనుగుణంగా స్క్రైబ్ ఇవ్వడం జరుగుతుంది అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని పోలీసు అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పి రామేశ్వర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శర్మ,తదితరులు పాల్గొన్నారు.

# బీసీ హాస్టల్లో కలుషిత ఆహారం



తిరుపతి : రేణిగుంట బీసీ బాలుర వసతిగృహంలో కలుషిత ఆహారం తిని 14మంది విద్యార్థులు అస్వస్థత పాలయ్యారు. హాస్టల్ భోజనంతో పాటు వెనుక ఓ ఇంట్లో జరిగిన గృహప్రవేశ ఫంక్షన్‌లో చేసిన మిక్చర్, మైసూర్‌పాక్‌ను విద్యార్థులకు అందజేశారు. తిన్న విద్యార్థుల్లో 15మందికి విరేచనాలు, వాంతులు కావడంతో తొలుత రేణిగుంట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం తిరుపతి రుయాస్పత్రికి పంపించగా అత్యవసర విభాగంలో చేర్చుకుని వైద్యం అందించారు. అనంతరం చిన్నపిల్లల వార్డుకు తరలించారు. ఒకటి రెండు రోజులు పరిశీలనలో ఉంచి విద్యార్థులు పూర్తిగా కోలుకున్న తరువాత డిశ్చార్జి చేస్తామని చిన్నపిల్లల వైద్య విభాగాధిపతి మనోహర్ తెలిపారు. డీఎంహెచ్‌వో శ్రీహరి రుయాస్పత్రికి చేరుకొని చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శిం చారు. అంతకుముందు జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి చంద్రశేఖర్, సహాయ అధికారి జోత్స్న, డీఎంహెచ్‌వో శ్రీహరి,డీపీవో సుశీలాదేవి రేణిగుంట ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్లోనిగదులు, మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించారు. డీఎంహెచ్‌వో శ్రీహరి మీడియాతో మాట్లాడుతూ హాస్టల్‌కు వెంటనే పర్మినెంట్ వార్డెన్‌ను నియమించాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీడీవో విష్ణు చిరం జీవి, డాక్టర్ చంద్రప్రకాషరెడ్డి, ఈవోపీఆర్డీ వెంకటరత్నప్రభ, ఎంఈ వో రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# రూ.5కే తీరుతున్న పేదల ఆకలి...




చిత్తూరు: వైసీపీ ప్రభుత్వం కూల్చడం, కక్ష కట్టి వేధించడమే లక్ష్యంగా ఐదేళ్లు పాలించింది. అందులో భాగంగా అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్లను కొనసాగిస్తే చంద్రబాబుకు మంచి పేరు వస్తుందని ఎత్తేసింది. రూ. 5కే కడుపు నిండా భోజనం చేసే పేదవాడి కడుపు మాడ్చింది. టీడీపీ కూటమి తిరిగి అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ మీద దృష్టి పెట్టింది. ఈ నెల 15న రాష్ట్రవ్యాప్తంగా తిరిగి ప్రారంభించేందుకు నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలోనూ అన్న క్యాంటీన్లు ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. కుప్పం కోర్టు సమీపంలో గత టీడీపీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్‌ను వైసీపీ అధికారంలోకి వచ్చాక రద్దు చేసింది. అక్కడ కుప్పం మున్సిపాలిటీకి చెందిన వార్డు సచివాలయాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం వచ్చాక ఆ సచివాలయాన్ని ఇతర ప్రాంతానికి మార్చేసి మళ్లీ అదే ప్రాంతంలో క్యాంటీన్‌ను ప్రారంభిస్తోంది. ఈ మేరకు ఇక్కడ అన్ని పనులూ పూర్తయ్యాయి. పలమనేరు బస్టాండు సమీపంలో టీడీపీ ప్రభుత్వం రూ.30 లక్షలతో క్యాంటీన్‌ను నిర్మించింది. వైసీపీ ప్రభుత్వం అన్నిచోట్లలాగే ఇక్కడా దాన్ని మూసేసింది. ఐదేళ్లుగా ఆ భవనం ఖాళీగానే ఉండిపోయింది. ఇప్పుడు మళ్లీ రూ.13 లక్షలతో మరమ్మతులు చేసి.. 15వ తేది ప్రారంభానికి సిద్ధం చేశారు. పుంగనూరులోని జడ్పీ గెస్ట్ హౌస్ ఆవరణలోని అన్న క్యాంటీన్ భవనాన్ని.. వైసీపీ అధికారంలోకి వచ్చాక మోటర్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ కార్యాలయంగా మార్చేశారు. తాజాగా, టీడీపీ ప్రభుత్వం దాన్ని బైపాసలోని ఓ భవనంలోకి మార్చి, మళ్లీ అదే ప్రాంతంలో క్యాంటీన్‌ను ప్రారంభించనుంది. ఈ మేరకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. నగరి సంతమైదానంలోని అన్న క్యాంటీన్ భవనాన్ని వైసీపీ హయాంలో మున్సిపల్ శానిటేషన్ ఆఫీసలా వాడుకుంది. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం అదే భవనంలో క్యాంటీన్‌ను ఏర్పాటు చేస్తోంది. రాష్ట్రంలోనే అన్న క్యాంటీన్‌ను తొలుత చిత్తూరులో పునఃప్రారంభించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక దీనిని మార్చేసి.. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆధ్వర్యాన అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. కొంగారెడ్డిపల్లెలోని ఈ క్యాంటీన్ భవనంలో గతంలో వార్డు సచివాలయాన్ని నిర్వహించేవారు. కక్ష కట్టి వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను మూసేస్తే.. టీడీపీ ప్రతిపక్షంలో ఉండి కూడా జిల్లాలో అన్న క్యాంటీన్లను నిర్వహించింది. చిత్తూరు, కుప్పం, బంగారుపాళ్యం, గుడిపాల, జీడీనెల్లూరు వంటి ప్రాంతాల్లో స్థానిక నాయకులు కలిసి అన్న క్యాంటీన్లను నిర్వహించి పేదల ఆకలి తీర్చారు. రెండేళ్ల కిందట కుప్పం బస్టాండు సమీపంలో టీడీపీ నాయకులు సొంత డబ్బుతో క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. తెల్లారి చంద్రబాబు ప్రారంభించనుండగా.. వైసీపీ నాయకులు ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. అయినా అన్న క్యాంటీన్‌ను టీడీపీ నేతలు కొనసాగిస్తూ

## వైఎస్ జగన్ కేసులో కీలక పరిణామం

అమరావతి, : వైసీపీ అధ్యక్షుడు , మాజీ సీఎం వైఎస్ జగన్ అక్రమాస్తుల కేసులో సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటు చేసుకుంది. అక్రమాస్తుల కేసులో జగన్ బెయిల్ రద్దు చేయాలని, కేసు విచారణను హైదరాబాద్ నుంచి మరో రాష్ట్రానికి మార్చాలని కోరుతూ మాజీ ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు సుప్రీంకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్ ధర్మాసనం విచారణ జరిపింది. విచారణ ప్రారంభం కాగానే పిటిషన్ ఏపీకి చెందిందని జగన్ తరుపు న్యాయవాది బెంచ్‌కు చెప్పారు. మారిన పరిస్థితుల్లో కౌంటర్ దాఖలుకు కొంత సమయం కావాలని సీబీఐ తరుపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరారు. అయితే స్పందించిన జస్టిస్ సంజయ్‌కుమార్ 'నాట్ బిఫోర్ మీ' అనడంతో పిటిషన్లు మరో ధర్మాసనానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా కేసును జస్టిస్ అభయ్ ఎస్ ఓకా నేతృత్వం వహించే ధర్మాసనం ముందుకు పంపాలని ఆదేశాలు జారీ చేస్తూ డిసెంబర్ 2న విచారణకు పంపాలని రిజిస్ట్రీకి ఆదేశించారు.

## సంపాదకీయం

### 1931 జనాభా లెక్కలేనా....

దేశంలో సామాజిక, ఆర్థిక సమానత్వం సాధించాలన్నా.. వెనుకబడిన వర్గాలు ముందుకు వెళ్లాలన్నా.. కులగణన ఒకటే మందు అని చాలా మంది నమ్ముతున్నారు. జమానా లెక్కలు కాకుండా లేటెస్ట్ సెన్సెస్ తోనే అసలైన పేదల గుర్తింపు సాధ్యమవుతుందన్నారు. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం చేయబోతున్న సర్వే దేశానికే రోల్ మోడల్ గా ఉంటుందంటున్నారుబీసీలకు రిజర్వేషన్లు, వారి జనగణన ఇష్యూ దేశవ్యాప్తంగా మరోసారి హాట్ టాపిక్ అవుతోంది. దేశంలో బీసీల జనాభా లెక్కలు తీయాలన్న డిమాండ్లు ఈనాటివి కావు. అయితే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మాత్రం ఈ లెక్కలు తీసేందుకు ముందుకు రావడం లేదంటున్నాయి విపక్షాలు. అసలు బీసీల్లో ఏయే కులాల్లో ఎంత మంది ఉన్నారన్న విషయం తెలిస్తే వారి సమగ్ర సంక్షేమానికి వీలవుతుందని బీసీ సంఘాల ఆలోచన. అందుకోసం బీసీ జనగణన ఒక్కటే మార్గమంటున్నారు. దేశ జనాభాలో ఎక్కువ శాతం బీసీలే ఉన్నారు. బీసీల సంఖ్య 70 కోట్ల ఉన్నట్లు ఓ అంచనా ఉంది. ఆ లెక్కన ఇది 56 శాతం. 90 ఏళ్ల నాటి డేటా ఆధారంగానే ఇప్పటికీ బీసీ రిజర్వేషన్లు కొనసాగుతున్నాయంటున్నారు. పదేళ్లకోసారి దేశంలో జనాభాను లెక్కిస్తున్నా.. అందులో దళితులు, గిరిజనుల సంఖ్యపై మాత్రమే స్పష్టమైన సమాచారాన్ని సేకరిస్తున్నారు. అయితే జనాభాలో ఓబీసీతో పాటు ఏ ఏ కులాల వారు ఎంతమంది ఉన్నారన్న సమగ్ర సమాచారం సేకరించడం లేదు. దేశంలో 1931లో చేసిన జనాభా లెక్కలే సంపూర్ణంగా కులగణనలతో చేసిన సమగ్ర లెక్కలుగా ఉన్నాయంటున్నారు. ఇప్పటికీ అవే ఆధారంగా మారాయి. 1979లో బీపీ మండల్ నేతృత్వంలో రెండో బీసీ కమిషన్ ను ఏర్పాటు చేశారు. ఈ కమిషన్ బీసీల జనాభాను 52 శాతంగా లెక్కగట్టి వీరికి విద్య, ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని 1980లో రిపోర్ట్ ఇచ్చింది. ఈ సిఫార్సులు 1992 నుంచి అమల్లోకి వచ్చాయి. దేశంలో 3,743 కులాలను బీసీలుగా మండల్ కమిషన్ తేల్చింది. అయితే కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ లిస్టులో 2,479 కులాలు మాత్రమే ఉన్నాయి. సర్వే చేస్తేనే బీసీల్లో ఉన్న కులాల లెక్క తేలే ఛాన్స్ ఉందంటున్నారు. 2017లో జస్టిస్ రోహిణి నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కమిషన్ ను నియమించింది. ఓబీసీ జాబితాను వర్గీకరించడం ఈ కమిషన్ పని. ఇప్పటికి ఈ కమిషన్ గడువును 13సార్లు పొడగించారు. ప్రస్తుతం బీసీల జనగణనపై కాంగ్రెస్, జేడీయూ, సమాజ్ వాదీ సహా మరికొన్ని పార్టీలు అగ్రెసివ్ గా వెళున్నాయి. వీలైన ప్రతిసారీ మోడీ సర్కార్ పై ఒత్తిడి పెంచుతున్నాయి. బీసీ కుల గణనతో చాలా లాభాలు ఉన్నాయని బీసీ సంఘాలు, విపక్షాలు అంటున్నాయి. వెనుకబడిన మెజార్టీ ప్రజలకు ప్రభుత్వ పథకాలు సమర్థంగా అమలు చేయడం, జనాభాకు తగ్గట్లుగా విద్యా, ఉద్యోగాల్లో తగినంత ప్రాతినిథ్యం దొరకడం, బీసీల్లోని పేదలకు రిలీఫ్ లభిస్తుందని అంటున్నారు. సీన్ కట్ చేస్తే బీసీల లెక్కలు తీసేందుకు మోడీ ప్రభుత్వం ఎందుకు వెనకడుగు వేస్తోందన్న ప్రశ్నలు వస్తున్నాయి. కులగణనపై సుప్రీంకోర్టు అడిగిన ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం కులాల వారీగా వెనుకబడిన తరగతుల జనగణన చేపట్టడం పాలనాపరంగా కష్టమని తెలిపింది. అయితే దీన్ని విపక్షాలు, బీసీ సంఘాలు తప్పు బట్టాయి. బీసీ కులాల వారీ లెక్కలు తీస్తే అందరికీ రిజర్వేషన్లు కల్పించడం కష్టమన్న ఆలోచనతో ఉన్నారా అన్న డౌట్లు వస్తున్నాయి. ఇప్పటికే రిజర్వేషన్ల కోటా 50 శాతం దాటొద్దని సుప్రీం తీర్పు ఉంది. ఆ లెక్కన చూసినా ఈ సబ్జెక్ట్ ముట్టుకుంటే మొదటికే ఇబ్బంది వస్తుందన్న ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం ఉందా అన్నది కీలకంగా మారింది. నిజానికి 2010లో యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు.. ఇదే బీజేపీ నాయకులు.. బీసీ కులాల వారిగా లెక్కలు తీయాలని పార్లమెంటులో డిమాండ్ చేశారు. ఇప్పుడు అదే బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంది. అటు బీసీల కులాల వారీ జనాభా లెక్కలు తీయడంతో పాటే పార్లమెంట్ లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని ఆర్.కృష్ణయ్య వంటి నేతలు డిమాండ్ చేస్తున్నారు. లోకల్ బాడీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు తేలాలంటే, బీసీల లెక్కలు తప్పనిసరిగా ఉండాలని గతంలో సుప్రీం ఆదేశించింది. లేకపోతే రిజర్వేషన్లు లేకుండానే ఎన్నికలు జరపాలని గతంలో తీర్పు ఇచ్చింది. దీంతో చాలా రాష్ట్రాల్లో కన్ఫ్యూజన్ మొదలైంది. కొన్ని రాష్ట్రాలు సొంతంగా బీసీల లెక్కలు తీసే పనిలో పడ్డాయి. ఇక తెలంగాణలో ప్రతి ఇంటిలోని కుటుంబ సభ్యులను సర్వే చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఆయా ప్రాంతాలలోని జనాభాను బట్టి అక్కడ సిబ్బందిని నియమించారు. ఎన్యూమరేటర్ రోజువారీగా తనకిచ్చిన షెడ్యూల్ ప్రకారం సర్వే పూర్తయ్యే వరకు పనిచేస్తారు. నేటి నుంచి జరిగే ఈ సర్వేలో ప్రతి కుటుంబ యజమానిని నేరుగా ఎన్యుమరేటర్ కలిసి వివరాలు సేకరిస్తారు. యజమాని లేకుంటే తగిన ఆధారాలు చెప్పే ఏ కుటుంబ సభ్యుడున్నా సరిపోతుంది. ఇలా సేకరించిన సమాచారం మొత్తం ఈ నెల చివరి నాటికి ఆన్‌లైన్‌లో అప్లోడ్చేస్తారు. సర్వేలో భాగంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల, విద్య, ఉపాధి వంటి అంశాలను సేకరించనున్నారు. వివరాల సేకరణ అనంతరం సంబంధిత ఇళ్లకు స్టిక్కర్లు అంటించనున్నారు. ఏ రోజు.. ఏ గ్రామంలో.. ఏ వార్డులో.. ఏ సమయంలో.. సర్వే చేయపట్టనున్నారనే సమాచారాన్ని ముందే ఆయా ప్రాంతాల్లోని వారికి చాటింపు, మైకుల్లో ప్రచారం ద్వారా తెలియజేస్తారు. సర్వేలో భాగంగా ఎలాంటి ఫొటోలు, గుర్తింపు పత్రాలు స్వీకరించరు.

Printed,PublishedandOwnedbyJADAVROHIDAS, PrintedatJADAVROHIDAS ,Associate printers,Padmanagar,Asifabad,Dist,Telangana-500001Publishedat,JANANINADAM,H..NO.12-27,Village;Fatkal , Mangi,Mandal;Lingapur,Dist:komaramBheem (Asifabad),State Telangana-505001,Editor:JADAV ROHIDAS RNI No.TELTEL/2023/12314,Cell:9550100197,9490111460.